క్లుప్తంగా

వేతనాలు పెంచాలని వినతి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని కాంట్రాక్టు అధ్యాపకులకు వేతనాలు పెంచాలని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం జేఏసీ కన్వీనర్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, బాధ్యులు కోరారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీకి శుక్రవారం వచ్చిన రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు గడ్డం కృష్ణ, రాధిక, మధుశ్రీ, శ్రీలత, సుచరిత పాల్, చీకటి శ్రీనివాస్, డాక్టర్ మధుకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

హసన్‌పర్తి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023 -24వ సంవత్సరానికి ఐదవ తరగతిలో ప్రవేశాలకు గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, వరంగల్ వెస్ట్ ప్రధానోపాధ్యాయురాలు హేమలత తెలిపారు. ప్రస్తుతం నాలుగవ తరగతి చదువున్న విద్యార్థులు పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. పుట్టిన తేదీ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 23న పరీక్ష ఉంటుందని వివరించారు.

సీపీఎం బైక్ ర్యాలీ

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద సీపీఎం నాయకుల బైక్‌ర్యాలీని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ప్రారంభించారు. కాజీపేట జంక్షన్ నుండి చౌరస్తా, ఫాతిమానగర్ మీదుగా హయగ్రీవచారి మైదానంలోని జనచైతన్య యాత్ర సభకు ర్యాలీగా నాయకులు తరలివెళ్లారు.

రైలులో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాశిబుగ్గ: రైలులో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణంచెందిన ఘటన చింతలపల్లి - వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన ప్రకారం సుమారు 25 - 30 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలులో నుంచి జారి పడి మృతి చెందాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచినట్లు సీఐ తెలిపారు. వివరాలకు 94415 57232, 94406 27532 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

హన్మకొండ అర్బన్: నగరంలోని వడ్డెపల్లి ముదిరాజ్‌వాడకు చెందిన బలుసుకూరి కొమురయ్య ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం పూర్తిగా దగ్ధమైంది. కొమురయ్య కుటుంబ సభ్యులు ఇంటిలో ఉండగానే ఒకసారిగా మంటలు వ్యాపించి ఇంట్లో ఉన్న ఫర్నిచర్‌తో పాటు విలువైన కాగితాలు, నగదు, ధాన్యం కాలిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. కాగా, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

ఖిలా వరంగల్: అన్నదమ్ముల ఆర్థిక లావాదేవీల విషయంలో పెద్దరికం చేసిన ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిచినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన గై రాజు, దేవేందర్ అన్నదమ్ముల మధ్య ఆర్థిక లావాదేవీల విషయమై గొడవలు జరుగుతున్నాయి. వారివురు కలిసి సమీప బంధువైన వలిశెట్టి రవీందర్ వద్దకు వెళ్లారు. ఇరువురికి నచ్చజెప్పి గొడవను శాంతించే ప్రయత్నం చేయగా గైరాజు అనే వ్యక్తి వలిశెట్టి రవీందర్‌పై కర్రతో దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. ఇటీవల మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం గైరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 9మందికి జరిమానా

కాజీపేట: కాజీపేట పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 9మందిని కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష, 8మందికి రూ.13,600 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.విద్యాసాగర్ రావు తీర్పునిచ్చారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ కథనం ప్రకారం గురువారం రాత్రి ట్రాఫిక్ సిబ్బంది బ్రీత్ ఎనలైజర్‌తో వాహనదారులకు పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వ్యక్తులను కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ తెలిపారు.

పోలీస్ వాహనం ఢీ.. ఇద్దరికి గాయాలు

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ ప్రధాన రహదారిపై యూటర్న్ తీసుకుంటున్న పెళ్లి కుమారుడి వాహనాన్ని అదుపు తప్పిన ఓ పోలీస్ వాహనం శుక్రవారం ఢీకొట్టింది. దాంతో ఇద్దరు తీవ్రంగా గాయపడగా చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం పోలీస్ హెడ్ క్వార్టర్‌కు చెందిన వాహనం బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో యూటర్న్ తీసుకుంటున్న ఓ పెళ్లి వాహనాన్ని ఢీకొట్టింది. ఆ వాహనంలో ఉన్న ఇద్దరు మహిళలు గాయపడ్డారు. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి పోలీస్ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు వాహనాల వేగం తక్కువగా ఉండడంతో పెద్దగా ప్రమాదం జరగలేదని తెలుస్తోంది.

కేఎంటీపీకి ‘మిత్ర’లో చోటు!

- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు మహర్దశ
- అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలకు అవకాశం

గీసుకొండ: జిల్లాలోని గీసుకొండ-సంగెం మండలాల పరిధి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)కి కేంద్ర ప్రభుత్వం ‘మిత్ర’లో చోటు కల్పించింది. దీంతో పార్కులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు మార్గం సుగమం కానుంది. ఇప్పటి వరకు కేవలం రాష్ట్ర ప్రభుత్వం కేఎంటీపీలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిధులు ఖర్చు చేస్తోంది. మిత్రలో చోటు దక్కడంతో కేంద్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకునే అవకాశం ఉంది. చైనా, వియత్నాం, ఇథియోపియా మాదిరిగా వస్త్రాల తయారీ, ఎగుమతుల్లో అగ్రగామిగా నిలవాలని భారత్ సంకల్పిస్తోంది. మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్, అండ్ అపెరల్(మిత్ర) పార్కులు నెలకొల్పే దిశగా కేంద్రం చేస్తున్న ఆలోచన తాజా నిర్ణయంతో కార్యరూపం దాల్చనుంది. ఇప్పటికే మడికొండలో 60 ఎకరాల విస్తీర్ణంలో కాకతీయ టెక్స్‌టైల్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ పార్కు అందుబాటులోకి రాగా.. కేఎంటీపీ కోసం ప్రభుత్వం సుమారు 1200లకు పైగా ఎకరాల భూ సేకరణ చేసి పెట్టుబడులను పెట్టి వస్త్ర యూనిట్లను నెలకొల్పాలని పలు కంపెనీలను ఆహ్వానిస్తోంది. దీనికి తోడు మిత్రలో చోటు దక్కడంతో దేశ, విదేశీ కంపెనీలు కేఎంటీపీలో వస్త్ర పరిశ్రమను నెలకొల్పడానికి ముందుకు వచ్చే అవకాశం ఉంది.

‘మిత్ర’తో మహర్దశ..

మిత్ర పథకానికి అర్హత సాధించాలంటే సుమారు వెయ్యి ఎకరాల స్థలం ఉండాలి. దీనికి అనుగుణంగా కేఎంటీపీలో భూసేకరణ చేశారు. ఇప్పటి వరకు గణేశ్ ఎకోటెక్, ఎకోపెట్ కంపెనీ 50 ఎకరాల స్థలంలో యూనిట్లను నెలకొల్పి వాడిన ప్లాస్టిక్ బాటిళ్ల నుంచి యార్న్ తయారు చేస్తోంది. సుమారు 700 మంది ఇందులో పని చేస్తున్నారు. కేరళకు చెందిన చిన్నపిల్లల గార్మెంట్ల తయారీ కంపెనీ కై టెక్స్‌కు 187.24 ఎకరాల స్థలాన్ని కేటాయించగా.. షెడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈకంపెనీ రూ.1,013 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. పని చేయడం ప్రారంభిస్తే సుమారు 11 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీకి 261.83 ఎకరాలు కేటాయించగా.. రూ. 8,40 కోట్ల ఖర్చు చేయనుంది. ఇందులో సుమారు 12 వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంది. సూరత్, బీవండి, షోలాపూర్ నుంచి తిరిగివచ్చే చిన్న చేనేత ఉత్పత్తిదారుల కోసం 135 ఎకరాలను కేటాయించగా.. రూ.10.78 కోట్లను ఖర్చు చేయడానికి ప్రతిపాదించారు. ఇవే కాకుండా.. పలు కంపెనీలు పెట్టుబడులు పెట్టి పార్కులో యూనిట్లను నెలకొల్పడానికి ముందుకు వస్తుండడం, వాటికి తోడు మిత్రలో కేఎంటీకి చోటు దక్కడంతో మరింత ఊతం లభించనుంది. పార్కులో మౌలిక సదుపాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,100 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించగా.. ఇప్పటి వరకు సుమారు రూ.500 కోట్లను ఖర్చు చేశారు.



కేంద్రం నిర్ణయం చాలా మంచిది

సూరత్, బివాండి, షోలాపూర్ నుంచి వచ్చిన చిన్న ఉత్పత్తిదారులకు కేఎంటీపీలో 135 ఎకరాలు కేటాయించారు. వీటిని ప్లాట్లుగా చేశారు. చాలామంది వంద శాతం డబ్బులు చెల్లించినా.. వారికి ప్లాట్లు కేటాయించలేదు. రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించలేదు. మిత్రలో చోటు దక్కడంతో త్వరగా మౌలిక వసతులు కల్పించే అవకాశం ఉంది.

\- మస్న కుమారస్వామి, దుర్గా శక్తి మల్టీ మెగా టెక్స్‌టైల్ ప్రెసిడెంట్

పెన్షనర్లకు కనీస సౌకర్యాల కల్పనకు కృషి

కాజీపేట: వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లకు కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హామీ ఇచ్చారు. కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలోని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో మహిళా వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. అనంతరం చీఫ్ విప్ మాట్లాడుతూ ప్రభుత్వ కొలువు చేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ప్రశాంతమైన జీవితం గడపడానికి ప్రయత్నించాలని సూచించారు. సంఘం అధ్యక్షుడు కె.సంగమయ్య, కార్యదర్శి కెవి.రావు, కోశాధికారి అయిలయ్య, బి.యాదయ్య, ఎండి.జహంగీర్, బి.వెంకటేశ్వర్లు, సురేంద్రనాథ్ పాల్గొన్నారు.



కాజీపేట: సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్

జనరిక్ ఔషధాలతో డబ్బు ఆదా

హన్మకొండ: జనరిక్ ఔషధాలతో డబ్బు ఆదా అవుతుందని, మందులు బాగా పని చేస్తాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ పోచమ్మకుంటలోని వీఎస్‌కే జనరిక్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌ను సందర్శించారు.

వైద్యానికి సర్కారు అధిక ప్రాధాన్యం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

హసన్‌పర్తి: వైద్యానికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి చెందిన పిట్టల ముక్తీశ్వర్‌కు రూ.2 లక్షలు, సుద్దాల శివమణికి రూ.1.25 లక్షల చొప్పున మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును లబ్ధిదారులకు ఇళ్ల వద్దకు వెళ్లి ఎమ్మెల్యే శుక్రవారం పంపిణీ చేశారు. తొలుత హసన్‌పర్తి మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఆర్యసమాజ్ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టల కుమారస్వామి, దేవస్థాన మాజీ చైర్మన్ పిట్టల సదానందం పాల్గొన్నారు. అలాగే, ఆంజనేయస్వామి దేవస్థాన అర్చకుడు కృష్ణమూర్తిని ఎమ్మెల్యే రమేష్ పరామర్శించారు. ఇటీవల కృష్ణమూర్తి కుమార్తె అనారోగ్యంతో మృతి చెందింది.

విద్యార్థినులకు ఆయుష్ కిట్ల పంపిణీ

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ రాయపురలోని యునాని ఆస్పత్రి ఆధ్వర్యంలో మచిలీబజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు ఆయుష్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేంద్రకుమార్ మాట్లాడుతూ నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విద్యార్థినులలో రక్తహీనతను తొలగించేందుకు, రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. అందులో భాగంగా హనుమకొండ జిల్లాలోని 9ప్రభుత్వ బాలికల పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయుష్ కిట్లలో 100 గ్రాముల బ్రాహ్మీ గుళికలు (ఆయుర్వేదం), 100 గ్రాముల మాజున్ - ఇ - ఫలసఫ, 20 గ్రాముల ఆల్ఫా ఆల్ఫా సిరప్(హోమియో), 50 గ్రాముల రాగి లడ్డు ఉంటాయని ఆయన తెలిపారు.



విద్యార్థికి కిట్ అందజేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో దినసరి వేతన, లంప్సమ్, టైంస్కేల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి డిమాండ్ చేశారు. కేయూలో శుక్రవారం జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం, పెండ్యాల రవిని జనరల్ సెక్రటరీ పదవి నుంచి తొలగిస్తూ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. యూనియన్ జనరల్ సెక్రటరీగా దేశిని రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంఘాల రాజును ఎన్నుకున్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ఎంజీఎం: హెచ్ఐవీ బారిన పడిన గర్భిణులు, బాలింతలకు వైద్యారోగ్యశాఖ, హెచ్ఐవీ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ సాంబశివరావు మాట్లాడుతూ మహిళలు సాధారణంగా ఎదుర్కొనే రక్తహీనతను అధిగమించడానికి ఈ కిట్లు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. మహిళల కోసం వైదారోగ్యశాఖ ప్రత్యేకంగా ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ స్వప్నమాధురి, జిల్లా సూపర్‌వైజర్ రామకృష్ణ, దేవయ్య, కరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరితో ప్రాణహాని



సమావేశంలో మాట్లాడుతున్న తోట పవన్

హన్మకొండ చౌరస్తా: గత నెల 20వ తేదీన హనుమకొండలో జరిగిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సభ వద్ద ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అనచరులు తనపై దాడి చేశారని యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్ తెలిపారు. దాడిలో తీవ్రంగా గాయపడి కోలుకున్న అతను శుక్రవారం మీడియాతో మాట్లాడారు. దాస్యం వినయ్‌భాస్కర్, విజయ్‌భాస్కర్‌లతో తనకు ప్రాణహాని ఉందని, తనకు ఏం జరిగినా పూర్తి బాధ్యత వారిదే అన్నారు. దాడిలో తీవ్రంగా గాయపడి మరణించినట్లుగా భావించి దుండగులు పారిపోయారని, ఇది నాకు పునర్జన్మ అన్నారు. బీసీ నాయకులను అణిచివేసిన వినయ్‌భాస్కర్, ఎన్నికలు వస్తే బీసీకార్డు బయటికి తీస్తాడన్నారు. వినయ్‌భాస్కర్‌ను దద్దమ్మ అంటే తప్పేంటని ప్రశ్నించారు. సమావేశంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమన్నారాయణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్ అరెస్ట్ అప్రజాస్వామికం

హన్మకొండ: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ అరెస్టు అప్రజాస్వామికమని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు అన్నారు. టీఎస్‌పీఎస్సీలో జరిగిన అక్రమాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిరాహార దీక్ష చేస్తున్న ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌ను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా శనిగరపు రాజు మాట్లాడుతూ శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దీక్షను భగ్నం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో బీఎస్పీ వరంగల్ జోనల్ మహిళా కన్వీనర్ అడ్లూరి పద్మ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కందుకూరి కిశోర్, వరంగల్ పశ్చిమ బాధ్యుడు కన్నం సునీల్, నాయకులు ధన్‌రాజ్, నాగరాజు, లత, ఇందిర, రవి పాల్గొన్నారు.



కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించాలి



బాధితులను పరామర్శిస్తున్న రాఘవరెడ్డి

కాజీపేట: స్వతహాగా వైద్య చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వమే పూర్తి ఖర్చులు భరించి వైద్యం చేయించాలని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి డిమాండ్ చేశారు. కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీకి చెందిన తిరుమల్‌రావు కొద్ది కాలంగా పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితం కాగా, కాంగ్రెస్ నాయకులతో కలిసి రాఘవరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల తిరుమల్‌రావు కుమార్తె అనారోగ్య సమస్యలతో మృతి చెందడంతో రాఘవరెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గుర్రం కోటేశ్వర్, బోయిని కుమారయాదవ్, సందెల విజయ్ కుమార్, అనితారెడ్డి, మద్దెల శోభ, అక్షయ్, మంజుల, దాసు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్‌ను పక్కాగా అమలు చేయాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న అధికారి

మడికొండ: ఈ విద్యా సంవత్సరం చివరి దశకు చేరిన సందర్భంగా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి మనోజ్‌కుమార్ సూచించారు. కాజీపేట మండలం మడికొండలోని మండల పరిషత్ పాఠశాలను మనోజ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో అమలవుతున్న విధానాన్ని పరిశీలించారు. తగరతి గదిలో విద్యార్థుల నైపుణ్యం, పుస్తక పఠనం చేయించి వారి సామర్థ్యాలను అంచనా వేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు మన్నె చంద్రయ్య, కోమల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా కూరగాయల మార్కెట్

- చిన్నపాటి చినుకులతో అధ్వానంగా తయారైన లక్ష్మీపురం మార్కెట్ పరిసరాలు
- పక్షం రోజులుగా పడకేసిన పారిశుద్ధ్య పనులు

వరంగల్: తేలికపాటి జల్లులు కురవడంతో వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్ అపరిశుభ్రంగా తయారైంది. 10 - 15రోజులుగా మార్కెట్ ప్రధాన రోడ్డుపై పారిశుద్ధ్య పనులు చేయకపోవడంతో మార్కెట్ పరిసర ప్రాంతాలు అధ్వానంగా తయారయ్యాయి. అపరిశుభ్ర వాతావరణంలోనే మార్కెట్‌లోని చిల్లర వ్యాపారులు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మురిగిపోయిన కూరగాయలను ఎక్కడపడితే అక్కడ పడవేయడంతో దుర్వాసన వస్తోంది. పరిసరాలను శుభ్రం చేయించాలని మార్కెట్ అధికారులను కోరగా టెండర్లు పిలిచామని, కొత్త కాంట్రాక్టర్ వచ్చాక చేస్తారన్న చెబుతున్నారని వ్యాపారులు తెలిపారు.



కూరగాయల మార్కెట్ గేటు ముందు దుస్థితి



బురదలోనే కూరగాయల విక్రయాలు

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయంపై బీజేపీ హర్షం

హన్మకొండ చౌరస్తా: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్.రెడ్డి విజయం సాధించడంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు హనుమకొండ చౌరస్తాలో టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి శుక్రవారం సంబరాలు నిర్వహించారు. పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, సత్యనారాయణ, సదానందం, జయంత్‌లాల్, జితేందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, శ్రీరాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, భరత్, కవిత, తలసి, శ్రీదేవి, మాధవి, సులోచన, నదియ పాల్గొన్నారు.

మార్పు కోరుకున్న ఉపాధ్యాయులు

హన్మకొండ: ఎమ్మెల్సీ ఎన్నికలో ఉపాధ్యాయులు మార్పును కోరుకున్నారని ఫలితాన్ని బట్టి స్పష్టంగా తెలుస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగు రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఎ.వెంకట్ నారాయణ రెడ్డి గెలుపు బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఒక హెచ్చరిక అని ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు

విద్యారణ్యపురి / కాజీపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్.రెడ్డి విజయం సాధించడంతో తెలంగాణ మేధావి వర్గం ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని బీజేపీ రిటైర్డ్ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ సెల్ రాష్ట్ర కో చైర్మన్ తిరువరంగం ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టీపీయూఎస్ విజయోత్సవాలు

విద్యారణ్యపురి: ఏవీఎన్.రెడ్డి గెలుపుతో సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈమేరకు హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఈఓ కార్యాలయం వద్ద శుక్రవారం బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీయూఎస్ ఇరు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తిని వెంకటరమణ, ఉప్పుల సతీష్, ఆముదాల దాత మహర్షి, బత్తిని వీరస్వామి, టీపీయూఎస్ రాష్ట్ర నాయకులు చిదురాల సుధాకర్, పిన్నింటి బాలాజీరావు, వీవీఆర్.ఆచార్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

కాశిబుగ్గ జంక్షన్‌లో..

కాశిబుగ్గ: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ బలపర్చిన ఏవీఎన్.రెడ్డి విజయం సాధించడంతో కాశిబుగ్గ జంక్షన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి బాకం హరిశంకర్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సముద్రాల పరమేశ్వర్, కనుకుంట్ల రంజిత్, పిట్టల కరణ్, సునన్, అపురూప రజనీష్ నేత, కోమాకుల నాగరాజు, కోట సతీష్, సుతారి గోపి తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్.రెడ్డి విజయం సాధించడంపై పార్టీ శ్రేణులు సంబరాలు జరుకున్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, నిశాంత్, తిరుపతిరెడ్డి, సాయి, సత్యప్రకాష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ఉపేందర్‌రావు

మామునూరు: ఏకాగ్రత, క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ప్రతీ విద్యార్థికి ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని వరంగల్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ జె.ఉపేందర్‌రావు సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో కళాశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా ఉపేందర్‌రావు, గాయకుడు హేమచంద్ర, హీరోయిన్ డింపుల్ హాయతి, కళాశాల చైర్మన్ సీహెచ్ నరసింహారెడ్డి, సెక్రటరీ సీహెచ్ దేవేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ సీహెచ్.సత్యపాల్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఉపేందర్‌రావు మాట్లాడుతూ ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తే ఉద్యోగాలను సులభంగా సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో వాగ్దేవి డైరెక్టర్లు వాణిదేవి, వాహినిదేవి, ఈవీ శ్రీనివాస్‌రావు, శేషాచలం, శ్రీనివాస్‌రెడ్డి, సంపత్ రెడ్డి, హరిందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఛేదించే వరకు విశ్రమించొద్దు

హసన్‌పర్తి: లక్ష్యాన్ని ఛేదించే వరకు విశ్రమించొద్దని ప్రముఖ సినీ గాయకుడు శ్యామ్ కాసర్ల అన్నారు. నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించున్న సంస్కృతి - 23 వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా శ్యామ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ రచయిత్రి డాక్టర్ దేవులపల్లి వాణి మాట్లాడుతూ సంగీతం, పుస్తక పఠనం తెలుగు సాహిత్యంపై దృష్టి కేంద్రీకరించడం, చారిత్రాత్మక సినిమాలు చూడడం వంటి అభిరుచులను అలవర్చుకోవాలని సూచించారు. శుక్రవారం రాత్రి సినీ గాయని హారిక నారాయణ్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తన పాటలతో సభను అలరించారు. కళాశాల సెక్రటరీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, కోశాధికారి నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ శంకర్, ప్రొఫెసర్ నరసింహారావు, ప్రొఫెసర్ కోమల్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారి, ఎండీఎఫ్ క్లబ్ విద్యార్థి ప్రధాన కార్యదర్శులు ఐశ్వర్య, జాఫర్ అహ్మద్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్యామ్

గ్లకోమాపై అవగాహన ర్యాలీ

హన్మకొండ చౌరస్తా: ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకుని శరత్ మ్యాక్సీ విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని శరత్ ఐ ఆస్పత్రి డైరెక్టర్, మేనేజింగ్ పార్టనర్ డాక్టర్ శరత్ బాబు జెండా ఊపి ప్రారంభించారు. హనుమకొండ అలంకార్ జంక్షన్‌లోని ఆస్పత్రి నుంచి వేయిస్తంభాల ఆలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ శరత్‌బాబు మాట్లాడుతూ గ్లకోమాతో కంటిచూపు పోయే ప్రమాదం ఉందని అన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఆస్పత్రి సిబ్బంది